కిషన్‌రెడ్డికి ఆహ్వానం



కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న చైర్మన్ అమర్‌సింగ్

గోల్కొండ: తెలంగాణలో బోనాల నిర్వహణకు తనవైపు నుంచి అన్ని సహాయ సహకారాలు ఉంటాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్వాన్ ఉమ్మడి బోనాల ఆహ్వాన పత్రాన్ని చైర్మన్ టి.అమర్‌సింగ్ శనివారం ఆయనను కలిసి అందించారు. ఈ సందర్భంగా దశాబ్దాల నుంచి కార్వాన్‌లో బోనాల నిర్వహణకు వెన్నెముఖగా నిలుస్తున్న అమర్‌సింగ్‌ను ఆయన సన్మానించారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.


గోల్కొండలో నేడు నాలుగో పూజ

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా నేడు గోల్కొండ కోట నాల్గవ బోనం పూజ నిర్వహిస్తున్నారు. మొత్తం తొమ్మిది బోనాల్లో భాగంగా నేడు నాలుగో పూజ నిర్వహిస్తున్నామని బోనాల నిర్వహణ ఉత్సవ కమిటీ చైర్మన్ చంటిబాబు తెలిపారు. నేడు జరిగే బోనాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంటుందని దీనికి గాను అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

10న గురు పూర్ణిమ మహోత్సవాలు

గౌలిపురా: లాల్‌దర్వాజాలోని దత్తసాయి మందిరంలో ఈ నెల 10వ తేదీ గురు పూర్ణిమ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి దత్త ప్రసాద్ దీక్షిత్ తెలిపారు. 10న ఉదయం 5 గంటలకు సాయిబాబా అభిషేకం, 7 నుంచి 8 గంటల వరకు శ్రీ దత్తాత్రేయ స్వామి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు మహా ప్రసాదం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

స్వామిగౌడ్‌కు ఆహ్వానం



స్వామిగౌడ్‌ను ఆహ్వానిస్తున్న మధుసూదన్‌గౌడ్

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి దేవస్థానం 76వ వార్షిక బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ శనివారం శాసనమండలి మాజీ చైర్మన్ కనకమామిడి స్వామి గౌడ్‌ను ఆలయ కమిటీ అధ్యక్షులు జనగామ మధుసూదన్ గౌడ్ కలిసి ఆహ్వానం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా 16న జరిగే శాకాంబరి పూజల్లో పాల్గొనాలని కోరారు.

రఘురామ్‌కు గరిమెళ్ల రామమూర్తి పురస్కారం



నాంపల్లి: రసరంజని హైదరాబాద్ నిర్వహణలో గరిమెళ్ల రామమూర్తి 89వ జయంతిని శుక్రవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ళ రామమూర్తి రంగస్థల పురస్కారం-2025ను కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్‌కు అందజేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐపీఎస్ అధికారి హెచ్.జె.దొర హాజరై పురస్కార గ్రహీతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం, నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్, సినీనటులు సుబ్బరాయ శర్మ, తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లక్డీకాపూల్: విద్యుత్ శాఖ సైఫాబాద్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం హుస్సేన్‌సాగర్, లేక్ వ్యూ సబ్ స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. షాదన్ కాలేజీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని షాదన్ కాలేజీ, ట్రాఫిక్ పీఎస్, కేజీఎన్ జిరాక్స్ ఏరియా, హెచ్‌డీఎఫ్‌సీ డైమండ్ టవర్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. అదే విధంగా ఈనాడు ఫీడర్ పరిధిలోని ఈనాడు ఆఫీస్, క్షేత్ర హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ తెలిపారు.

లంగర్‌హౌస్‌కు పండుగ శోభ

- నేడు సామూహిక బోనాల ఊరేగింపు
- రాష్ట్ర నలుమూలల నుంచి ప్రధాన ఆలయాల తొట్టెల సమర్పణ
- గోల్కొండ అమ్మవారికి నాలుగో పూజ నేడే..
- తొలి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు
- చాతుర్మాస దీక్షలు నేటి నుంచి ప్రారంభం
- వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు



లంగర్‌హౌస్‌లో సామూహిక బోనాల ఊరేగింపు (ఫైల్)

లంగర్‌హౌస్: తొలి ఏకాదశి..జగదాంబిక అమ్మవారికి నాలుగో పూజ..చాతుర్మాస దీక్షల ప్రారంభం అన్ని పండుగలు నేడే. ప్రధాన పండుగలకు నేడు లంగర్‌హౌస్ కేంద్రంగా కానుంది. అమ్మవారి నాలుగో పూజా కార్యక్రమాల్లో భాగంగా లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి సామూహిక బోనాలు, తొట్టెలల ఊరేగింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు నగరంలోని ప్రధాన అమ్మవార్ల ఆలయాల నుంచి బోనాలు తొట్టెలలను లంగర్‌హౌస్ చౌరస్తాకు తీసుకువస్తారు. అక్కడ నుంచి గోల్కొండ ఆలయ చైర్మన్ కొండేపుడి చంటిబాబు ఆధ్వర్యంలో దాదాపు 48 తొట్టెలలు కళాకారులు, పోతరాజులు, శివసత్తులతో సామూహిక ఊరేగింపుగా గోల్కొండకు తరలివెళ్తాయి.

చాతుర్మాస దీక్షలు ప్రారంభం..

తొలి ఏకాదశిని పురస్కరించుకొని జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయం ముస్తాబయ్యింది. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో చాతుర్మాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. వైష్ణవ సంప్రదాయం ప్రకారం తెలుగు వారు మొదటి పండుగగా భావించే తొలి ఏకాదశి పండుగను నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

నాల్గవ పూజను పురస్కరించుకొని గోల్కొండ కోటకు దాదాపు ఐదు లక్షల మంది భక్తులు తరలిరానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాహనాలను 20 ప్రాంతాల్లో దారి మళ్లించనున్నట్లు అధికారులు తెలిపారు. లంగర్‌హౌస్ పీ. ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్ కింద, లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి చెరువు, చోటాబజార్ మీదుగా గోల్కొండ కోట వరకు పూర్తిగా వాహనాల రాకపోకలు నిషేధం అన్నారు. కోటకు వచ్చే భక్తుల వాహనాలు, సెవెన్ టూంబ్స్ సమీపంలో, మోతీ దర్వాజ, రాందేవ్‌గూడ వద్ద నిలిపివేయనున్నామని పోలీసులు తెలిపారు.

నాలుగో పూజకు తరలిరండి



నేడు గోల్కొండ జగదాంబిక అమ్మవారి నాలుగో పూజకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధానంగా భక్తులు నేడు అధిక సంఖ్యలో తరలిరానుండగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం. భక్తుల సేవ కోసం దారి పొడవునా పోలీసులతో పాటు మా వలంటీర్లు అందుబాటులో ఉంటారు. భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా అధికారుల సూచనలు పాటిస్తు అమ్మవారిని దర్శించుకోవాలి.

– చంటిబాబు, గోల్కొండ జగదాంబిక ఆలయ చైర్మన్

నైపుణ్యవంతులైన సాంకేతిక నిపుణులను అందించాలి



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

విజయనగర్‌కాలనీ: పారిశ్రామిక రంగం అవసరాల మేరకు ఐటీఐల ద్వారా నైపుణ్యవంతులైన సాంకేతిక నిపుణులను అందించాలని ఉపాధి శిక్షణ, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం విజయనగర్‌కాలనీ వెటర్నరి అసోసియేషన్ హాల్‌లో ఐటీఐ ఉత్తమ పురస్కారాలు, విజన్ వర్క్‌షాప్-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐటీఐలు ఇండస్ట్రియల్ ట్రెనింగ్ కేంద్రాలు మాత్రమే కాదని ఇండియన్ టాలెంట్ అండ్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ శిక్షణ పొందితే త్వరితగతిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం పదవీ విరమణ పొందిన ఐటీఐ ప్రిన్సిపాళ్లు, అధికారులతో పాటు ఐటీఐ శిక్షణ పొంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో పాటు ఐటీఐ శిక్షణ పొంది సొంత పరిశ్రమలు, కంపెనీలు స్థాపించి తమతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్న వారికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరి దాన కిశోర్, స్కిల్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, కార్మిక శాఖ అడిషనల్ డైరెక్టర్ గంగాధర్, జాయింట్ డైరెక్టర్ ఎస్‌వికె.నగేష్, డిప్యూటీ డైరెక్టర్ ప్యారం నర్సయ్యతో పాటు రాష్ట్రవ్యాప్త ఐటీఐల ప్రిన్సిపళ్లు, అధికారులు పాల్గొన్నారు.

రాంచందర్‌రావుకు అభినందనల వెల్లువ



రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణా నాయక్ తదితరులు



రాంచందర్‌రావును సన్మానిస్తున్న దయాసాగర్‌రెడ్డి తదితరులు

చాంద్రాయణగుట్ట: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రాంచందర్‌రావుకు పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణా నాయక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివాసం ఆయన నివాసంలో కలిసి సన్మానించి భగవాన్ బాలాజీ, హాతీరామ్ బావోజీ చిత్రపటాన్ని అందజేశారు. బీజేపీ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు హరి, భాగ్యనగర్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాథోడ్ ఉన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం..

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. రాంచందర్‌రావు రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకుడు టి.యోగ్‌రాజ్‌సింగ్ శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

రాంచందర్‌రావుకు సన్మానం..

చార్మినార్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాంచందర్‌రావును గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమామహేంద్ర ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాంచందర్‌రావు అధ్యక్షతన తెలంగాణలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. బీజేపీ చార్మినార్ నియోజకవర్గం మాజీ కన్వీనర్ సురేందర్ తదితరులు ఉన్నారు.

దయాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

అఫ్జల్‌గంజ్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.రాంచందర్‌రావును కట్టెలమండిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు మేకల దయాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ నుంచి దాదాపు 300 మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి సన్మానించారు. దయాసాగర్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో బీజేపీదే అధికారమన్నారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావును అభినందిస్తున్న యోగ్‌రాజ్‌సింగ్



రాంచందర్‌రావును సన్మానిస్తున్న ఉమామహేంద్ర

రోటరీ డిస్ట్రిక్ట్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాల కోటిరెడ్డి



రోటరీ డిస్ట్రిక్ట్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న బాల కోటిరెడ్డి

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2024-25 ప్రెసిడెంట్ రోటరీ డిస్ట్రిక్ట్-3150 బెస్ట్ ప్రెసిడెంట్‌గా అవార్డు అందుకున్నారు. రోటరీ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి చేతుల మీదుగా ఆయన చేసిన సేవలకు గుర్తింపునకు ఈ అవార్డు లభించింది. రోటరీ డిస్ట్రిక్ట్-3150 పరిధిలో 100 క్లబ్‌లు ఉండగా అందులో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాల కోటిరెడ్డిని ఈ అత్యుత్తమ సేవా అవార్డు వరించింది. ఏడాది వ్యవధిలో ఆయన 235 సర్వీసు ప్రాజెక్టులు చేసి దాతల నుంచి రూ.7.15 కోట్లు సేకరించి సేవల కోసం ఖర్చు చేశారు. ఇందులో పేద మహిళలకు కుట్టుమిషన్లు, స్కూల్ విద్యార్థులకు బ్యాగ్‌లు, కిట్‌లు, బాలికలకు సైకిళ్లు, దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. ఈ సేవలకు ఆయనకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది.

నేడు యాంటి రేబిస్ డే

విజయనగర్‌కాలనీ: నేడు పెంపుడు జంతువులకు ఉచిత యాంటి రేబిస్ టీకాలు ఇస్తున్నట్లు శాంతినగర్ పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జునోసిస్ డేను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జూలై 6న పెంపుడు జంతువులకు ఉచిత యాంటి రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లోని పెంపుడు జంతువుల యజమానులు ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌కు సన్మానం



హరిచందనను సన్మానిస్తున్న కైలాష్ సజ్జన, ఇంద్రకంటి రాజేష్

అబిడ్స్: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనను కాంగ్రెస్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కైలాష్ సజ్జన, సామాజిక వేత్త ఇంద్రకంటి రాజేష్ శనివారం సన్మానించారు. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆమెకు వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో తమ పూర్తి సహకారం ఉంటుందని వెల్లడించారు.

సన్మానం



అబిడ్స్: రాష్ట్ర కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను ఆర్టీఏ యాక్టివిటీస్ట్ అజిత్ హిందుజా సన్మానించారు. శనివారం ఆయనను సన్మానించి ఓ మెమోరాండంను అందజేశారు.

తెలంగాణలో అసమర్థుల పాలన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: తెలంగాణలో అసమర్థ పాలన కొనసాగుతుంది అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్‌లో సీసీ రోడ్డు వేయడం పూర్తయిన సందర్భంగా రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో భారీ స్థాయిలో అవినీతి కొనసాగుతుందన్నారు. రోజుకో పథకాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో ఒకటి కూడా అమలు పరచలేకపోతుందన్నారు. తెలంగాణకు ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాది కోట్లు మంజూరయ్యాయన్నారు. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దేవర వంశీతో పాటు వివిధ విభాగాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నాయకుల నిరసన



చాంద్రాయణగుట్ట: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన డీవైఎఫ్ఐ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం తగదని డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణా నాయక్ అన్నారు. అరెస్టులకు వ్యతిరేకిస్తూ శనివారం జంగమ్మెట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం చేతులెత్తేసిందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా ఖాళీ పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగులతో చర్చలు జరపాలన్నారు. లేనియెడల ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, భరత్, గోపాల్, శ్రీను, క్రాంతి కుమార్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం



బొంతు రామ్మోహన్‌కు మెమొంటోను అందజేస్తున్న మమతాగుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొనసాగుతుందని నగర మాజీ మేయర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరంగా మారాయన్నారు. శనివారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్‌గుప్తా బొంతు రామ్మోహన్‌కు మెమొంటోను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ..ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమన్నారు.

పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

నాంపల్లి: నియోజకవర్గంలో పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడంలో బీఎల్‌ఓలు కీలకమైన పాత్ర పోషించాలని మెహిదీపట్నం సర్కిల్-12 ఉప కమిషనర్, ఈఆర్ఓ సురేందర్‌రెడ్డి అన్నారు. రెడ్‌హిల్స్ డివిజన్‌లోని శాంతినగర్ క్లబ్‌లో బీఎల్‌ఓలుగా నియమితులైన వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ఇప్పటి వరకు బీఎల్‌ఓలుగా పనిచేసిన వారికి సరైన అవగాహన లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమగ్రమైన ఓటరు జాబితాను బీఎల్‌ఓలు రూపొందించాలంటే శిక్షణ తప్పనిసరి అన్నారు. ఓటు నమోదు, జాబితాను వీరే పర్యవేక్షిస్తారని తెలిపారు. మార్పులు-చేర్పులు, తొలగింపు, కొత్త ఓటరు నమోదు, ఫారం-6, ఫారం-7, ఫారం-8లపై బీఎల్‌ఓలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

సబ్జిమండీలో సహకార సంఘం దినోత్సవం



గోల్కొండ: కలిసి ఉంటే కలదు సుఖం అన్న విషయాన్ని సహకార సంఘాలు నిరూపిస్తున్నాయని సబ్జిమండీ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొర్శల శ్రీనివాస్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సబ్జిమండి గంగపుత్ర సంఘం వారు ఐక్యంగా ఉంటూ గంగపుత్ర సంఘం సోదరుల అభ్యున్నతికి బాటలు వేస్తున్నారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి వేణుబాబు, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వాతి, ప్రధాన కార్యదర్శి లావణ్య, మత్స్య మహిళా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు రేఖ, ప్రధాన కార్యదర్శి విద్య, మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం సబ్జిమండీ అధ్యక్షులు తిరుమలానంద, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, లింగం, ప్రధాన కార్యదర్శి మురారి రాంబాబు పాల్గొన్నారు.

పదో మొహర్రం ఊరేగింపునకు సర్వం సిద్ధం

- నేడు డబీర్‌పురా నుంచి చాదర్ ఘాట్ వరకు సామూహిక ఊరేగింపు
- పాతబస్తీలో కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు

చార్మినార్: ఇస్లాం మతం పరిరక్షణ కోసం కర్బలా యుద్ధ మైదానంలో అసువులు బాసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ గత నెల 26వ తేదీ నుంచి షియా ముస్లింలు మొహర్రం సంతాప దినాలను పాటిస్తున్నారు. ఇందులో భాగంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని అషుర్‌ఖానాలలో ఆలంలను ప్రతిష్ఠించి మాతం, మజ్లిస్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీలో బీబీ ఆలం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే తగిన ఏర్పాటు పూర్తయ్యాయని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డబీర్‌పురాలోని బీబీ కా అలావాను సందర్శించిన సందర్భంగా మొహర్రం ఊరేగింపునకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. సామూహిక ఊరేగింపు కోసం ఇప్పటికే కర్ణాటక నుంచి లక్ష్మి అనే ఏనుగును నగరానికి తరలించారు. డబీర్‌పురా నుంచి బయలుదేరే ఊరేగింపు డబీర్‌పురా దర్వాజా, యాకుత్‌పురా, కోట్ల అలీజా, చార్మినార్, మీరాలం మండి, దారుషిఫా ద్వారా చాదర్‌ఘాట్ వరకు కొనసాగనుంది. బీబీకా అలవా నుంచి బయలుదేరే బీబీ కా అలం ఊరేగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయని నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.

దారి మళ్లింపు ఇలా..

- సునార్‌గల్లి 'టి' జంక్షన్ వద్ద బీబీ కా అలవా వైపు వాహనాల రాకపోకలు అనుమతించబడవు. దీనిని డబీర్‌పురా దర్వాజా, గంగానగర్ నాలా, యాకుత్‌పురా వైపు దారి మళ్లిస్తారు.
- షేక్ ఫైజ్ కమాన్ వైపు వాహనాల రాకపోకలను అనుమతించకుండా అవసరాన్ని బట్టి జబ్బార్ హోటల్ వద్ద డబీర్‌పురా దర్వాజా లేదా చంచల్‌గూడ వైపు మళ్లిస్తారు.
- ఎతెబార్ చౌక్ నుంచి వచ్చే వాహనాల రాకపోకలను బడా బజార్ వైపు అనుమతించరు. ఎతెబార్ చౌక్ వద్ద కోట్ల అలిజా లేదా పురానా హవేలి వైపు అవసరం/పరిస్థితిని బట్టి మళ్లిస్తారు.
- ఊరేగింపు చార్మినార్ చేరుకున్నప్పుడు, నయాపూల్ నుంచి వచ్చే వాహనాలను చార్మినార్ వైపు అనుమతించరు. మదీనా క్రాస్ రోడ్ వద్ద సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు సర్తాక్ అలావా చేరుకున్నప్పుడు ట్రాఫిక్‌ను ఎస్జే రోటరీ వైపు అనుమతించకుండా నయాపూల్ వద్ద మదీనా వైపు మళ్లిస్తారు.
- ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు జిల్లా బస్సులను ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు రంగ్‌మహల్, అఫ్జల్‌గంజ్ వైపు మళ్లిస్తారు. ఊరేగింపు గమ్యస్థానానికి చేరుకునే వరకు కాలికబార్, మీరాలం మండి రోడ్డుపైకి అనుమతిస్తారు.
- ప్రయాణ సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే 9010203626లో సంప్రదించాలని ఆయన సూచించారు.